క్లుప్తంగా

జగన్‌ను కలిసిన వెంకటేగౌడ



జగన్‌మోహన్‌రెడ్డితో వెంకటేగౌడ

వి.కోట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. బెంగళూరులోని జగన్ మోహన్‌రెడ్డి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు. అనంతరం వెంకటేగౌడ పలమనేరు నియోకజవర్గంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను తమ అధినేతకు వివరించారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు: ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో ఆదివారం వారాహి గ్రూప్స్, బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ వైద్యులతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 136 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన 11 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారికి బెంగళూరులో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి హేమంత్‌రాయల్ తెలిపారు. సంస్థ ప్రతినిధులు మౌనిక, సాధిక, కిషోర్, మల్లిక, రమ్య, సరిత పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణే ధ్యేయం: ఫైర్ ఆఫీసర్



మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్

పుంగనూరు: సమాజంలో జరుగుతున్న అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ కాలనీలోని అగ్నిమాపక కేంద్రంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆయన ప్రజలతో కలిసి నిర్వహించారు. సుబ్బరాజు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ప్రారంభించిన అగ్నిమాపక వారోత్సవాల్లో అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించామన్నారు. ప్రమాదాల నివారణకు సహకరిస్తున్న అధికారులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అభినందనీయం



సంబరాలు చేసుకుంటున్న నేతలు

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణ అమలు అభినందనీయమని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు, మాతంగి నాగభూషణం అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నరసింహులు మాట్లాడుతూ వర్గీకరణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఎస్‌పీ నేతలు శంకర్, ప్రభాకర్, వెంకట్రమణ, చిట్టి, శంభునరసింహులు, శ్రీనివాసులు, నారాయణ, అమర, మురళి, వెంకటస్వామి, పల్లెనారాయణ, శ్రీరాములు, కేశవ, రమణ, చంద్రన్న పాల్గొన్నారు.

సన్మానం



నందకిశోర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: ఇండియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.నందకిశోర్‌ను స్థానిక సంఘ అధ్యక్షుడు డా.యుగంధర్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రయివేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న అక్రమాలు, ఆర్‌ఎంపీ, పీఎంపీల కారణంగా ఇబ్బందులపై మాట్లాడారు. దీనిపై ప్రజల్లో అవగాహన కలగాలని ఆయన తెలిపారు. వైద్యులు మమతారాణి, డా.సునీల్ పాల్గొన్నారు.

సూక్తి త్రిశతి పుస్తకావిష్కరణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులోని తపోవనంలో ఆదివారం గుడివాడ అన్నయ్య నాయుడు రచించిన చిన్ని సూక్తి త్రిశతి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పంచసహస్రావధాని మేడసాని మోహన్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ చేశారు. మేడసాని మాట్లాడుతూ సంప్రదాయ విలువలను ప్రతిబింబించేది ప్రాచీన సాహిత్యమేనన్నారు. ప్రజల్లోకి ఎంత ఎక్కువగా వెళితే అంతా గొప్పగా సమాజం తీర్చిదిద్దుకుంటుందన్నారు.

దోస.. గోస

- మార్కెట్‌లో కిలో రూ.5తో నష్టాలు
- నష్టాల ఊబిలో దోస రైతులు
- అన్నదాతల కడుపు కొడుతున్న వ్యాపారులు
- రూ.5కు కొనుగోలు.. రూ.20కి అమ్మకాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

రొంపిచెర్ల: దోస పంటకు ధరలు లేక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. రొంపిచెర్ల మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె, చిచ్చిలివారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె గ్రామాల్లో 840 ఎకరాల్లో దోస పంటను రైతులు సాగు చేశారు. ఎకరా దోస పంట సాగు కోసం రూ.లక్ష ఖర్చు చేశారు. దీంతో పంట దిగుబడి కూడా బాగా వచ్చిందన్న రైతుల సంతోషం కొద్ది రోజులు కూడా ఉండలేదు. ధరలు భారీగా తగ్గిపోయాయి. గత సంవత్సరంలో కిలో రూ.17 ధర పలికిన దోస ఈ ఏడాది కిలో రూ.5 పలుకుతోంది. దీంతో దోస పంట సాగు చేసి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. రైతుల వద్ద కిలో రూ.5 కొనుగోలు చేసిన వ్యాపారులు మార్కెట్‌లో రూ.20కు విక్రయిస్తున్నారు. లక్షలు పెట్టుబడి పెట్టి పంటసాగు చేసిన రైతులకు మాత్రం అప్పులు మిగిలాయి. వ్యాపారులకు మాత్రం లాభాలు వస్తున్నాయి. బయట ప్రాంతాల నుంచి వ్యాపారులను ఇక్కడ ఉన్న వ్యాపారులు రానివ్వడం లేదని సమాచారం. దోస కాయలు కావాలంటే ఇక్కడ నుంచి మీమే సరఫరా చేస్తామని వారికి హామీ ఇస్తున్నారు. దీంతో రైతులకు రావాల్సిన లాభం వ్యాపారులకు పోతోందని రైతులు విలపిస్తున్నారు. గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విలపించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని దోస రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.



రొంపిచెర్లలో సాగు అవుతున్న దోసపంట


పెరిగిన సాగు విస్తీర్ణం

రొంపిచెర్ల మండలంలో గత సంవత్సరం 300 ఎకరాల్లో దోస పంట రైతులు సాగు చేస్తే ఈ ఏడాది 840 ఎకరాల్లో పంట సాగైంది. రైతులు పోటీ పడి పంటను సాగు చేశారు. అయితే ఈ ఏడాది ముంబై, ఢిల్లీ నగరాలకు దోస కాయల ఎగుమతి పూర్తిగా నిలిచిపోయింది. దీంతో చైన్నై, బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనికి తోడు అన్ని ప్రాంతాల్లోనూ దోస పంట సాగు పెరిగింది. దీని కారణంగా పంటకు గిట్టుబాటు ధర పలకడం లేదు.

రూ.4 లక్షలు నష్టం



నాలుగు ఎకరాల్లో దోస పంట సాగు చేశా. పంట సాగు కోసం రూ.6 లక్షలు ఖర్చు చేశా. పంట బాగా దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధరలేదు. కిలో రూ.5 ధర పలుకుతోంది. పంట సాగు వలన రూ.4 లక్షలు నష్టం వచ్చింది. ఇప్పుడు ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు. ఎవరూ రైతును పట్టించుకోవడం లేదు. వ్యవసాయ పంటల సాగు మానుకోవాలని అనుకుంటున్నా. – **రామనారాయణరెడ్డి, రైతు ముప్పిరెడ్డిగారిపల్లె**



మంచి దిగుబడి వచ్చిన దోస కాయలు



దోస కాయలను కోస్తున్న కూలీలు



లారీకి లోడ్ చేస్తున్న కూలీలు

నోటీస్ బోర్డు

25న నూర్‌షావలి దర్గా ఉరుసు

పుంగనూరు: పట్టణంలోని చెరువు కట్టపై గల హజరత్ సయ్యద్ నూర్‌షావలిబాబా ఉరుసు ఈనెల 25న ప్రారంభంకానుంది. 25న గంధం, 27న ఖవ్వాలి, 28న తహలీల్‌ఫాతేహా జరపనున్నారు. దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే ఎస్‌ఎస్.పేటలోని కళాశాల మైదానంలో ఉరుసు దుకాణాలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఉరుసు కార్యక్రమానికి కులమతాలకతీతంగా ప్రతిఒక్కరూ హాజరై తిలకించాలని నిర్వాహకులు కోరారు.

పెళ్లి వేడుకల్లో వెంకటేగౌడ



పలమనేరు: పట్టణానికి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ శ్యామ్ కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదివారం హాజరై నూతన వధూవరులను ఆదివారం ఆశీర్వదించారు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు హాజరయ్యారు.

కామిదొడ్డి గంగమ్మ జాతరలో..

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం కామిదొడ్డి గంగమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మూడు పుస్తకాల ఆవిష్కరణ



మూడు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పలమనేరు: ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్టు తరపున జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీల్లో బహుమతులు పొందిన రచయితలకు హైదరాబాదులోని రవీంద్రభారతిలో జాతీయ స్థాయి సాహిత్య పురస్కారాల కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ అవార్డును స్థానిక కవి, చయిత జుజ్జూరి వేణు అందుకున్నారు. దీంతోపాటు కథలతో కథ ప్రపంచం, నవల సాక్షాత్కారం, లోపలేదో కదులుతున్నట్టు అనే మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇందులో కార్యక్రమ నిర్వాహకులు మలిశెట్టి శ్యాంప్రసాద్, సాహితీవేత్తలు వాడ్రేవు చిన వీరభద్రుడు, మాజీ ఐఏఎస్ అధికారి యాకూబ్, ఏకే ప్రభాకర్, పలమనేరు బాలాజి పాల్గొన్నారు.

వేలిముద్రలు వేయించుకున్నారు.. బియ్యం ఇవ్వరేం?

ఐరాల: వేలిముద్రలు వేయించుకొని.. తాము తీసుకోకుండా బియ్యం ఎక్కడికి పోతాయ్. ఎప్పుడు పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి వీఆర్‌ఓను అడిగినా లేదంటూ సమాధానం చెబుతున్నారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పుల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద రేషన్ కార్డులు చేతపట్టుకొని మహిళలు ఆదివారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా తమ ప్రాంతానికి చెందిన డీలర్ చంద్ర చౌకదుకాణంలో బియ్యం, కందిపప్పు, చక్కెర ఇతర నిత్యావసర సరుకులు ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వెళ్లినా అందించేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక కూటమి నేతలు వారికి సంబంధించిన వ్యక్తికి ఇవ్వాలని తమ ప్రాంతానికి చెందిన డీలర్‌ను తొలగించారని వాపోయారు. దీంతో డీలర్ చంద్ర హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు తమ పంచాయతీ కార్యాలయంలో వీఆర్‌ఓ ఆధ్వర్యంలో రేషన్‌షాపు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. తమ ప్రాంతంలో 320 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారని చెప్పారు. నాలుగు నెలలుగా వీఆర్‌ఓ యల్లప్ప మొదటి రోజు వెళ్లిన వారికి మాత్రమే వేలి ముద్రలు వేయించుకొని బియ్యం అందజేస్తున్నారు. మిగిలినవారు ఎప్పుడు వెళ్లినా బియ్యం లేవంటున్నారని, వీఆర్‌ఓ సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రతినెలా 70 మందికి బియ్యం అందడం లేదన్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి బియ్యం అందేలా చూడాలని వారు కోరారు.

జీఓ:117 రద్దు చేయాలి

పలమనేరు: జీఓ నం:117 రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.సోమచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. గతంలో 3,4,5 తరగతులకు అనుకూలంగా ఉన్నచోట ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి సబ్జెక్టు బోధించే వారున్నారన్నారు. ఇప్పుడు వాటిని విడదీసి పంచాయతీలో ఏర్పాటు చేసే మోడల్ ప్రాథమిక పాఠశాలలో కలపడం కరెక్ట్ కాదన్నారు. దీంతో ఉన్న ఊరును వదిలి వేరే ఊరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 6, 7, 8 తరగతులకు ఎస్‌జీటీ టీచర్లే బోధించాలనడం సరికాదన్నారు.

మర్యాదపూర్వక కలయిక

చౌడేపల్లె: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కల్యాణ్ భరత్ ఆదివారం తిరుపతిలోని నివాసంలో కలిశారు. రాష్ట్ర విద్యార్థి విభాగం సయుక్త కార్యదర్శిగా నియమితులైన ఉత్తర్వులను కుటుంబసభ్యులతో కలిసి పెద్దిరెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. తమపై నమ్మకంతో పార్టీలో విద్యార్థి విభాగంలో రాష్ట్రస్థాయిలో చోటు కల్పించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు అందుకుంటున్న కల్యాణ్ భరత్

హిందువుల ఐక్యతే ధ్యేయం





పట్టణంలో మార్చ్ ఫాస్ట్ చేస్తున్న స్వయం సేవకులు, సమావేశంలో మాట్లాడుతున్న కార్యవహా

వి.కోట: హిందువుల ఐక్యతే ధ్యేయమని వక్తలు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) సంస్థ ప్రారంభమై వంద ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలో ఆదివారం నిర్వహించిన స్వయం సేవకుల మార్చ్‌ఫాస్ట్ అత్యంత ఉత్సాహంగా సాగింది. పట్టణంలోని మార్కెట్ యార్డు నుంచి గాంధీ రోడ్డు మీదుగా దుర్గా నగర్, వేణుగోపాలస్వామి ఆలయం వరకు సాగిన స్వయం సేవకుల పథసంచలనం భారత్ మాతాకి జై అనే నినాదాలతో పట్టణంలో హోరెత్తించింది. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయ ప్రాగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మన ఐక్యతే మన బలమని ప్రతి చోటా ఐక్యతతోనే జవాబులివ్వాలని స్వయం సేవకులను కోరారు. జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ కార్యవాహ హరికృష్ణ, ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రభాకర్‌రాజు, కృష్ణమూర్తి, కుమార్, ధనంజయ, శరవణ పాల్గొన్నారు.



బిక్కుబిక్కుమంటూ..

ప్రస్తుతం గుడిపాల మండలంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులతో వరి రైతులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కొన్నిరోజులుగా ఎండలు మండిపోగా.. రెండు రోజులుగా సాయంత్రం సమయంలో బలమైన ఈదురుగాలులతో పాటు వర్షం వచ్చే సూచనలు కనిపిస్తుండడంతో చేతికి వచ్చిన పంట నేలపాలవుతుందేమో అన్న భయం రైతులను వెంటాడుతోంది. మరో పదిరోజుల్లో కోతలు కోయాల్సిన సమయంలో ఈ ఈదురుగాలులు అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. –గుడిపాల

ఏటిగడ్డ దారి సమస్య తీరేనా?

- రెండు దశాబ్దాలుగా గ్రామస్తులకు తప్పని అవస్థలు
- కౌండిన్య నది ప్రవహిస్తే పది కిలోమీటర్లు చుట్టుకెళ్లాలి
- వర్షాకాలంలో మట్టిదారిలో కాలినడక కష్టమే

పలమనేరు: మండలంలోని పెంగరగుంట పంచాయతీ ముసలిమడుగు నుంచి ఏటిగడ్డ గ్రామానికి దారి సమస్య ఎన్నటికీ తీరేనోనని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈ గ్రామంలో యానాదులు, బీసీలకు చెందిన 40 దాకా కుటుంబాలున్నాయి. వ్యవసాయకూలీలు, అటవీ ఉత్పత్తుల సేకరణ చేసుకుంటూ బతుకుతున్నారు. గ్రామానికి దారి సమస్యను తీర్చాలని రెండు దశాబ్దాలుగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి జిల్లా అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. కానీ దారి సమస్య మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదు.

మెయిన్‌రోడ్డు నుంచి రెండే కిలోమీటర్లు...

పలమనేరు– గుడియాత్తం మెయిన్ రోడ్డులో ముసలిమడుగు నుంచి పడమటి వైపు రెండు కిలోమీటర్లలో ఈ గ్రామం ఉంది. ఇక్కడికి కాలి దారి మాత్రమే దిక్కు. మధ్యలో కౌండిన్య నది ప్రవహిస్తోంది. నదిలో నీళ్లు లేనప్పుడు వెళ్లొచ్చు. అదే నీరుంటే మాత్రం మండలంలోని సముద్రపల్లి, క్రిష్టాపురం గ్రామాల మీదుగా అటవీమార్గంలో గ్రామానికి చేరుకోవాల్సి ఉంటుంది. నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలి కాబట్టి నిధుల సమస్య కారణంగానే ఈ పనులను అధికారులు చేపట్టలేదనే మాట వినిపిస్తోంది. దీంతోపాటు దారిపక్కనున్న కొందరు రైతులు దారి వెడల్పుకు సహకరించడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

జబ్బులొస్తే ఆస్పత్రి కెళ్లడం కష్టం..

ఇప్పుడున్న మార్గంలో కనీసం ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి. ఇక వర్షాకాలంలో కనీసం మనుషులు కాలినడకన వెళ్తామన్నా దారి మొత్తం బురదమయంగా గుంతల్లో నీరు నిలిచి ఉంటుంది. గ్రామంలోని రైతులు మార్కెట్‌కు కూరగాయలు తీసుకెళ్లాలన్నా కుదరక కేవలం ఆహారపంటలను మాత్రమే సాగుచేసుకుంటున్నారు. ఇక గర్భిణులు, వృద్ధులు, పసిపిల్లల అత్యవసరంగా ఆస్పత్రికెళ్లాలంటే క్రిష్టాపురం మార్గంలో పది కిలోమీటర్లు దూరం చుట్టుకెళ్లాల్సిందే. ఈ మార్గంలో గత టీడీపీ ప్రభుత్వంలో జల్లితోలి వదిలేశారు. ఆపై తారు రోడ్డు పనులు చేపట్టలేదు. దీంతో బైక్‌పై వెళ్లాలన్నా జల్లి కారణంగా బైక్‌లు అదుపుతప్పుతున్నాయి. ప్రభుత్వం స్పందించి గ్రామానికి రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన మట్టిదారిలో గ్రామానికి కాలినడకన వెళుతున్న గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

పుంగనూరు: ఈస్టర్‌ను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు వేకువజామున సమాధుల తోటకు వెళ్లి సమాధులను ప్రత్యేకంగా అలంకరించి, ప్రార్థనలు జరిపారు. తిరిగి సీఎస్ఐ హట్టన్ మెమోరియల్ చర్చికి చేరుకున్నారు. అక్కడ పాస్టర్ రాకేష్ నిమ్రోద్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కార్యదర్శి రవి కుమార్, ప్రతినిధులు భరత్‌భూషణ్, సురేష్, కృష్ణఫర్, ఉదయ్‌కుమార్, కృపాకర్, చిట్టి, హేమంత్‌కుమార్, ఎస్తేర్ హేమలత, ప్రభావతి, సుకన్య, భారతి, హెప్సిబా, సుమిత్ర, సరళ పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు బీసీ కాలనీలోని చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను పాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్ ధనరాజ్ ఏసుక్రీస్తు పునరుర్థానాన్ని వివరంగా తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రార్థనల్లో సుశీల, టైటస్, రీనా, రాజేష్, కోదండ రామయ్య, సత్యవతి చెంగల్‌రాయులు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పులిచెర్ల(కల్లూరు): చర్చిలో ఏసు సందేశం వినిపిస్తున్న పాస్టర్